# డామిట్ ! కథ అడ్డం తిరిగింది !

ఫోను రింగయ్యింది....

"ఎవరు కావాలండీ?" రిసీవర్ ఎత్తి అడిగింది టెలిఫోన్ ఆపరేటర్ అమృత.

"చంద్రమౌళి కావాలి!" అవతలి వ్యక్తి చెప్పాడు.

"జస్టే మినిట్ !" అని బదులు చెప్పి అకౌంట్స్ సెక్షన్‌లో ఉన్న చంద్రమౌళికి కనెక్షన్ ఇచ్చింది.

"హలో..చంద్రమౌళీ స్పీకింగ్ !"

"హలో... నేను... సుబ్రహ్మణ్యాన్ని మాట్లాడుతున్నాను."

"ఓ నువ్వా ! ఎప్పుడొచ్చావ్ గురూ?" అడిగాడు చంద్రమౌళి ఉత్సాహంగా.

"రాత్రి వచ్చాను."

"తీసుకొచ్చావా?"

"ఓ.ఎస్. వచ్చింది."

"ఎలా ఉంటుందీ? బావుంటుందా?" ఆత్రుతగా అడిగాడు మౌళి.

"తినబోతూ రుచి అడగడం దేనికి? సాయంత్రం వచ్చేయి."

"అదికాదు గురూ! మన 'టేస్ట్' కి సరిపోయేలా ఉంటుందో లేదో ముందుగా తెలుసుకుంటే మంచిదనీ..."

"ఒక్క ముక్కలో చెప్పాలంటే లేత కొబ్బరిముక్కలా ఉంటుంది. మొన్ననే పదిహేడు వెళ్ళి పద్దెనిమిది వచ్చింది !" సుబ్రహ్మణ్యం చెప్పాడు.

"తెలుపా ? నలుపా? "

"చామనచాయగా ఉంటుంది. కళ్ళు మాత్రం చాలా బాగుంటాయి."

"పొట్టిగా ఉంటుందా? పొడుగ్గానా?"

"అంత పొడుగూ కాదు. పొట్టీ కాదూ ! యావరేజ్‌గా ఉంటుంది. కానీ, మంచి పర్సనాలిటీ

అని నువ్వే ఒప్పుకుంటావ్. !" సుబ్రహ్మణ్యం చెప్పాడు.

"అదిసరే... రేటు సంగతి మాట్లాడావా?" క్షణం ఆగి అడిగాడు మౌళి.

"అవన్నీ తరువాత మాట్లాడుకోవచ్చులే. ఫోన్లో ఎందుకూ? అయినా, నీ టేస్ట్‌కి అమ్మాయి సరిపోవాలే కానీ, రేటుతో ప్రాబ్లం ఉండదు ! ఆ హామీ నేనిస్తున్నాను."

"ఇంతకీ అమ్మాయి ఎక్కడ ఉంది?"

"విజయాకాలనీ లో మా ఫ్రెండు ఇల్లుందిగా. అతనేమో ఫామ్లీతో ఎల్టీసీ మీద యాత్రలకు వెళ్ళాడు. ఆ ఇంటి తాళం చెవులు నా దగ్గరే ఉన్నాయి. రూమ్‌లో అయితే బాగుండదని ఆ ఇంట్లో పెట్టాను ! అయిదో నెంబరు ఇల్లు ! వచ్చేస్తావుగా? "

"అలాగే ! అయిదవగానే ఆఫీసునుంచి ఓ సారి నా రూమ్‌కి వెళ్ళి బట్టలు మార్చుకొని వచ్చేస్తాను."

"ఓకే !" డిస్‌కనెక్ట్ అయిపోయింది.

అంతవరకూ టెలిఫోన్‌లో జరిగిన వాళ్ళిద్దరి సంభాషణా రహస్యంగా విన్న అమృత ఆలోచనలో పడింది.

'చంద్రమౌళి-ఇలాంటి వాడా?' అనుకుంది.

'అమ్మాయిలపిచ్చి ఉంది కనుకనే ఇంతకాలం పెళ్ళి చేసుకోలేదన్న మాట' అని కూడా నిర్ణయానికొచ్చింది.

అసలు ఆఫీసులో ఎవరికైనా బయటినుంచి ఫోన్‌కాల్ వచ్చినపుడు వాళ్ళకి కనెక్షన్ ఇచ్చేసి ఊరుకోవాలే గానీ వాళ్ళేం మాట్లాడుకుంటున్నదీ ఆపరేటర్ వినకూడదు. అది ఆ వృత్తి ధర్మంలో ప్రధాన నీతిసూత్రం !

అయితే, ఈ మధ్య చంద్రమౌళి అంటే అమృతకు పడటం లేదు. ఎప్పుడో ఒకప్పుడు ఎలాగో అలా, ఎందులోనైనా సరే అతన్ని ఇరికించాలని ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నంలో భాగంగా ఈమధ్య చంద్రమౌళితో ఎవరు ఫోన్చేసి మాట్లాడుతున్నా పని గట్టుకుని రహస్యంగా వింటోంది.

అమృత ఆ కంపెనీలో మూడేళ్ళనించీ పని చేస్తోంది. ఆమె వయస్సు పాతికేళ్లకు పైనే ఉంటుంది. ఇంకా పెళ్ళి కాలేదు. కాకపోవడానికి కారణాలు చాలా ఉన్నాయని చెప్పుకుంటారు.

అమృతకు తండ్రి లేడు. వాళ్ళది పేదకుటుంబం. ఇంటికి పెద్దకూతురుగా ఆ కుటుంబ బాధ్యతను తీసుకోవాల్సి వచ్చింది. అందుకే ఉద్యోగంలో చేరింది. ఆమెకు ముగ్గురు తమ్ముళ్ళుఉన్నారు. వాళ్లంతా చదువుకుంటున్నారు. ఆ పరిస్థితుల్లో కట్నం కానుకలిచ్చి కూతురు పెళ్ళి చేయలేకపోయింది అమృత తల్లి. పెళ్ళింకా కాలేదని వయసు ఆగదు కదా? ఆ వయసు చేసే తొందరవల్ల అప్పుడప్పుడు ఎవరెవరితోనో తిరుగుతూంటుందని కూడా పుకార్లున్నాయి.....

పోతే చంద్రమౌళి కూడా అదే కంపెనీలో ఆరేళ్ళనించీ పని చేస్తున్నాడు. చదువూ, సంధ్యా, అందం, చందం, ఆస్తీ అంతస్తూ అన్నీ ఉన్నాయి అతనికి. అయినా ఇంకా పెళ్ళి కాలేదు. ఆ సంగతి గ్రహించిన అమృత అతన్ని వలలో వేసుకొని, ఎలాగైనా సరే పెళ్ళి చేసుకోవాలని ప్రయత్నించింది.

చివరకి ఓ రోజు ధైర్యం చేసి తన మనసులోమాట అతనికి చెప్పేసింది కూడా !

చంద్రమౌళి ఒప్పుకోలేదు.

"నాకు కాబోయే భార్య ఎలా ఉండాలో నేను కొన్ని అభిప్రాయాల్ని ఏర్పరచుకున్నాను. పైగా నేను ముక్కుకి సూటిగా మాట్లాడే మనిషిని ! నీ 'కేరెక్టర్' పట్ల నాకు అంతగా నమ్మకం లేదు !" అని కుండ బద్దలు కొట్టినట్టు చెప్పాడు.

ఆ మాటలు అమృత అహాన్ని దెబ్బ తీశాయి.

"పెళ్ళి చేసుకోను" అని ఒక్కమాట చెప్పి ఉంటే అంత బాధ కలిగేది కాదు. తన కేరెక్టర్ గురించి ఓ విసురుకూడా విసిరేసరికి అమృత ఒళ్ళు మండిపోయింది. అప్పటినుంచీ అతనిపై త్రాచుపాములా పగ బట్టింది. ఆ పగ తీర్చుకునే సమయం కోసం ఎదురు చూస్తోంది.

"ఇప్పుడు దొరికాడు ! నా తడాఖా చూపిస్తాను" . అనుకుంది.

వెంటనే అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఇనస్పెక్టర్‌గా పని చేస్తున్న తన దూరపు బంధువు వేలాయుధానికి ఫోన్ చేసింది.

★ ★ ★

సాయంత్రం ఆరుగంటల వేళ!

విజయాకాలనీలో అయిదో నంబరు ఇంటికి చేరుకున్నాడు చంద్రమౌళి.

అక్కడకు కొంచెం దూరంలో కిళ్ళీషాపు దగ్గర నిలబడిన అమృత, తన పక్కనే

ఉన్న వేలాయుధానికి చంద్రమౌళిని చూపిస్తూ చెప్పింది -

"అతనే చంద్రమౌళి ! అతనూ, అతని ఫ్రెండూ కలిసి అమ్మాయిని 'బుక్' చేసుకుని ఆ ఇంట్లో పెట్టారు!"

"ఓకే ! నువ్విక్కడే ఉండు ! నేను వెళ్ళి అక్కడ ఏం జరిగేదీ చూస్తాను. నువ్ చెప్పింది కరెక్టే అయితే, 'బ్రోతల్‌కేసు' కింద వాళ్ళ ముగ్గుర్నీ అరెస్టు చేస్తాను !" అంటూ అటు నడిచాడు మఫ్టీలో ఉన్న ఇన్‌స్పెక్టర్ వేలాయుధం.

నెమ్మదిగా ఆ ఇంటి కాంపౌండు దగ్గరకు చేరుకుని కిటికీ పక్కగా నిలబడి కర్టెన్ సందులోంచి లోపలకు చూశాడు.

చంద్రమౌళి ఆ హాలులో ఉన్న సోఫాలో కూర్చుని ఉన్నాడు. అతని కెదురుగా ఉన్న సోఫాలో మరో యువకుడున్నాడు. అతని ముఖం మాత్రం కనిపించటం లేదు వేలాయుధానికి.

వాళ్ళ మాటలు స్పష్టంగానే వినిపిస్తున్నాయి.

"మరి ఆలస్యం ఎందుకూ? అమ్మాయిని రమ్మను !" అన్నాడు చంద్రమౌళి.

"రాజీ !" లోపలకు చూస్తూ కేక పెట్టాడతను.

'అమృత చెప్పిన సుబ్రహ్మణ్యం బహుశా అతనే అయ్యుండాలి !' అనుకున్నాడు వేలాయుధం. మరింత ఆసక్తిగా లోపలకు చూస్తున్నాడు.

మరో నిమిషంలో పక్కగదిలోంచి ఓ అమ్మాయి నెమ్మదిగా వాళ్లదగ్గరకు వచ్చింది.

ఆమె తెల్లటి పట్టుచీర కట్టుకుంది. తలనిండా సన్నజాజులు పెట్టుకుంది. పైటను భుజం మీదుగా కప్పుకుని నేల చూపులు చూస్తూ నిలబడిపోయింది.

"చేసేది ఒళ్ళుఅమ్ముకునే వ్యాపారం, పైకి పతివ్రతాలక్షణాల్ని ప్రదర్శించటం!" అనుకుంటూ పళ్ళుకొరుక్కున్నాడు కిటికీలోంచి లోపలకు చూస్తున్న వేలాయుధం.

"సిగ్గుపడుతూ నిలబడితే ఎలా? ఇలా వచ్చికూచో" అన్నాడు సుబ్రహ్మణ్యం , పక్కనే ఉన్న కుర్చీ చూపిస్తూ.

ఆమె సిగ్గు పడుతూనే వచ్చి కుర్చీలో కూర్చుంది.

ఇక వ్యవహారాలన్నీ నువ్వూ, తనూ మాట్లాడుకోండి. ఈ లోగా నేను మంచి కాఫీ తయారుచేసి పట్టుకొస్తాను !" అంటూ మరో గదిలోకి వెళ్ళిపోయాడు సుబ్రహ్మణ్యం.

"మీ పేరు?" అడిగాడు చంద్రమౌళి.

"రాజేశ్వరి."

"ఏం చదువుకున్నారు?"

"బి. ఎ. పాసయ్యాను!" చెప్పిందామె.

"బహుశా నా గురించిన వివరాలన్నీ మీ కజిన్ చెప్పే ఉంటాడు."

అవునన్నట్టు తల ఊపింది ఆమె.

"నా రేటు గురించి కూడా చెప్పాడుగా?" అనుమానంగా అడిగాడు చంద్రమౌళి.

అర్థంకానట్టు చూసిందామె.

"అదే. ! కట్నం గురించి ! అఫ్‌కోర్స్, ఆ పదాన్ని వాడకూడదు కనక, దాన్ని 'రేటు' అన్నాను. ఈ రోజుల్లో కట్నం ఇవ్వటం, పుచ్చుకోవటం నేరమనీ, ఘోరమనీ తెలుసు ! పైగా మీ లాంటి చదువుకున్న ఆడపిల్లలు కట్నాలకు వ్యతిరేకులనీ తెలుసు. కానీ, నాకు ఆర్థికంగా కొన్ని సమస్యలున్నాయి. వాటిని పరిష్కరించుకోవాలంటే అర్జంటుగా పదిహేను వేలు కావాలి. అయితే నెలకు రెండువందలు చొప్పున బ్యాంకులో వేసి పదిహేనువేలు కాగానే మీ బాకీ మీకు తీర్చేస్తాను..." వివరించాడతను.

"ఆ విషయాలన్నీ మా అన్నయ్యతో మాట్లాడండి !" తల వంచుకునే వినయంగా చెప్పింది.

అంతలో లోపల్నించి సుబ్రహ్మణ్యం కాఫీ కప్పులున్న ట్రే తో అక్కడకు వచ్చాడు.

"అన్నీ మాట్లాడేసుకున్నారా?" కప్పులు అందిస్తూ అడిగాడు.

"ఓ.ఎస్ ! ఇక రేటు సంగతే తేల్చుకోవాలి !" చెప్పాడు చంద్రమౌళి.

"రేటుతో ప్రాబ్లెమ్ ఉండదని ఇందాకా ఫోన్లోనే చెప్పాను. రాజేశ్వరి నాకు పిన్ని కూతురే అయినా, రక్తం పంచుకు పుట్టిన చెల్లెలి కంటే ఎక్కువగా చూసుకుంటాను. పైగా మా అమ్మ చిన్నప్పుడే పోతే, నేను మా పిన్ని దగ్గర పెరగటం వల్ల మేం ఇద్దరం సొంత అన్నా చెల్లెళ్ళలా, పెరిగాం ! నా చెల్లెలి కోసం ఆ మాత్రం డబ్బు ఎలాగోలా నేనే తెచ్చి ఇవ్వగలను. అయినా, తన కూతురి పెళ్ళి కోసం ఆ మాత్రం మా పిన్ని ఇవ్వకపోదు. కనుక మా చెల్లాయ్ నీ టేస్టుకి సరిపోయిందో లేదో చూసుకుని రేటు సంగతి నాకు వదిలెయ్. దట్సాల్ !" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నాకు భార్యగా వచ్చే అమ్మాయి చదువుకుని ఉండాలి గానీ, ఉద్యోగం చేయకూడదనుకున్నాను. ఆకర్షణ ఉండాలే గానీ, అందం అక్కర్లేదనుకున్నాను. ఆర్థికంగా నా కంటే కొంచెం పేద కుటుంబంనించి రావాలనుకున్నాను. అనుకున్నట్టుగానే నా అభిరుచులకు సరిపడేలా ఉంది నీ చెల్లాయ్. కాబట్టి ఈమెను పెళ్ళి చేసుకునేందుకు నాకు అభ్యంతరం లేదు !" కాఫీ కప్పు టీపాయ్ మీద పెడుతూ చెప్పాడు మౌళి.

"థాంక్యూ వెరీమచ్ ! ఇన్నాళ్ళూ మనిద్దరం స్నేహితులుగానే ఉన్నాం. ఇక బంధువులం కూడా కాబోతున్నందుకు చాలా సంతోషంగా ఉంది !" అన్నాడు సుబ్రహ్మణ్యం మౌళి రెండు చేతుల్నీ పట్టుకుని కుదిపేస్తూ.

"మరి నేను పోయిరానా ?" లేచాడు చంద్రమౌళి.

"ఒకే ! మరో గంటలో మేం కూడా బయల్దేరాలి ! ఎనిమిదింటికి బస్సుంది. అది ఎక్కితే తెల్లారేసరికి వెళ్ళిపోవచ్చు. "

"రాత్రేగా వచ్చారు. మళ్ళీ ఈ రాత్రికూడా ప్రయాణం చేస్తే నిద్ర ఉండదేమో !..." అన్నాడు మౌళి.

"అమ్మో ! మా పిన్ని ఖంగారు పడిపోతుంది. అసలు ఈ పెళ్ళి చూపులు తంతు మా ఊళ్ళోనే 'అరేంజ్' చేయమంది. కానీ, 'పెళ్ళికూతురు' ఇంట్లోనే పెళ్ళి చూపులు ఏర్పాటు చేస్తే నీకు అచ్చిరావటం లేదనే సెంటిమెంట్ గురించి చెప్పి బలవంతాన ఆవిణ్ణి ఒప్పించి చెల్లాయ్‌ని తీసుకొచ్చాను. మళ్ళీ వెంటనే వెళ్లిపోకపోతే కుదరదు !"

"సరే ! మీ చెల్లాయికి నేనుకూడా నచ్చినట్టయితే వెంటనే ముహూర్తం పెట్టించమని మీ పిన్నిగారికి చెప్పు ! వస్తా !" ఓరకంట రాజేశ్వరిని గమనిస్తూ బయటకు నడిచాడు చంద్రమౌళి.

వాకిట్లో కిటికీ దగ్గర నిలబడి- లోపల, వాళ్ళు మాట్లాడుకున్న విషయాలన్నీ విన్న వేలాయుధం వెర్రిముఖం వేసుకుని చంద్రమౌళి కళ్లబడకుండా రోడ్డు మీదకు వచ్చి పడ్డాడు. ఆ తరువాత అమృతకు చివాట్లు పెట్టాడో, లేదో మనకు తెలియదు ! ★

(ఆంధ్రప్రభ - 2-4-86)